# గ్రంథ పరిచయము

అగాధము, జటిలము, వైవిధ్యమయము అయిన జగత్తును చూసినప్పుడు, "ఇది ఎక్కడ నుంచి వచ్చింది? ఎందుకు వచ్చింది?" అని ఇత్యాది ప్రశ్నలు మనస్సులో రావటం స్వాభావికం. వీటికి అనుమానాది ప్రమాణములతో ఉత్తరములు దొరకవు. శ్రుతి ప్రమాణము నుంచే దొరుకుతుంది. శ్రుతి ఇలా చెపుతుంది – "ఏకమేవాద్వితీయము అత్యంత నిర్గుణమైన బ్రహ్మ జగత్కారణము. దాని శక్తి అయిన మాయ ద్వారా అది జీవుల కర్మఫలభోగము కోసము, మోక్షసాధన కోసము జగదాకారమును పొందుతుంది. ఇలా ప్రతి కల్పములోనూ, జగత్తు బ్రహ్మనుంచే పుట్టి దానిలో లయమవ్వడం వల్ల జగత్తు స్వరూపం బ్రహ్మమే. జగత్తు అసత్యము, బ్రహ్మమొక్కటే సత్యము. అది నీవే అనే ఆత్మవిద్యను నీవు పొందితే ముక్తుడవుతావు." ఈ శ్రుతి సిద్ధాంతమును స్పష్టం చేయటానికి భగవంతులైన శంకరులు ప్రస్థానత్రయభాష్యమును రచించారు. వాటిలో జగత్తును గురించి అసత్యమని, అనిర్వచనీయమని, మిథ్యయని, ఇలా వేరువేరు విశేషణములతో వర్ణించారు. ఈ అన్ని విశేషణములు పర్యాయములని తెలుసుకొన్నవారికి భాష్యవాక్యములు పరస్పర విరుద్ధముగా కనిపిస్తాయి. దానిని సమన్వయం చేయుటకు జటిలమైన తర్కములను ఉపయోగిస్తే శాంకర సిద్ధాంతము నిస్సందిగ్ధము కాకుండా ఇంకా ఎక్కువగా సందిగ్ధము అవుతుంది. అప్పుడుజగత్స్వరూపము స్పష్టము కాదు, బ్రహ్మస్వరూపమూ స్పష్టము కాదు. ఒక్కొక్కరికీ ఒక్కొక్కవిధముగా అర్థమవుతుంది. శాంకరభాష్యములు ప్రసన్నము, గంభీరము అయినప్పటికీ – శ్రుత్యర్థములో భిన్నాభిప్రాయములకు అవకాశము లేనట్టు – వాటిలో కూడా లేదనే జ్ఞానము ఈ గ్రంథాధ్యయనము వల్ల ముముక్షువులకు అంది, దాని ద్వారా తత్త్వనిదిధ్యాసనములకు దారి చూపిస్తున్నదని మా నమ్మకం.

Maha Parivrajaka